క్లుప్తంగా

24 నుంచి వేసవి భక్తి సంగీత శిక్షణ తరగతులు

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మే 27వ తేదీ వరకు వేసవి భక్తి సంగీత శిక్షణా తరగతులు ఉంటాయని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రతి రోజు ఉదయం 9 గంటలకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

ఆకట్టుకున్న హరికథా గానం



నల్లకుంట: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాస, హరికథా కేసరి దివంగత నేతి లక్ష్మీ నారాయణ భగవతుల శిష్య బృందం సంయుక్తాధ్వర్యంలో గురువారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో సంస్మరణ పూర్వక హరికథాగాన మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణా చారి మాట్లాడారు

ఇఫ్తార్ విందు



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్ ముస్లింలైన్‌లో గురువారం సాయంత్రం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.డి.ఇషాక్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ముస్లిం మైనార్టీలతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అస్లాం, నేత శ్రీనివాస్, ఎండి అహ్మద్, సురేందర్, నాని, నవీన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ తెలిపారు. గురువారం రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టి కమ్యూనిటీహాల్‌లో బీజేపీ సీనియర్ నాయకురాలు జి.భాగ్యలక్ష్మి నాయకత్వంలో సుమారు 50 మంది మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మహిళలందరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నాయకులు ముదిగొండ మురళీ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మట్టికుప్పల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ చేపట్టిన వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని డివిజన్‌లో విజయవంతంగా నిర్వహించేందుకు చొరవ తీసుకుంటానని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం డివిజన్‌లోని దుర్గానగర్‌లో చేపట్టిన ప్రజా సమస్యల ప్రత్యేక కార్యక్రమంలో ఆమె స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ అంబికా పాల్గొన్నారు.

‘119 స్థానాల్లో పోటీచేస్తాం’



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేసీఆర్ కుటుంబమే తెలంగాణ ప్రతిఫలాన్ని అనుభవిస్తోందని ప్రజాపార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ విమర్శించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాపార్టీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 సంవత్సరంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాపార్టీ 119 స్థానాల్లో పోటీ చేయనుందన్నారు. కార్యక్రమంలో ప్రజాపార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు మిద్దె అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థుల ఆందోళన



శ్రీరమణ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న బీసీ హాస్టల్ విద్యార్థులు

అంబర్‌పేట: ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. సరైన భోజనం అందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా విద్యార్థులంతా రోడ్డుపై బైఠాయించారు. అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా సమీపంలో ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులు అస్వస్థకు గురికావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం ధర్నాకు దిగారు. వంద మందికి పైగా విద్యార్థులు రోడ్డుపై నినాదాలు చేస్తూ రోడ్డుపై ఆందోళన చేయడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. విషయం తెలుసుకున్న అంబర్‌పేట పోలీసులు విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేశారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వీరికి విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు లభించడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకుంది. దీంతో సమాచారం అందుకున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



బీపీ మండల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్

నల్లకుంట: అసమానతలు, పీడనలు, వేదనలతో కుంగిపోతున్న బీసీల జీవితాలలో మండల్ కమీషన్ సిఫారసులు సామాజిక మార్పుకు, న్యాయానికి దోహదం చేశాయని తెలంగాణ బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. గురువారం నల్లకుంటలోని జాతీయ బీసీ దళ్ కార్యాలయంలో బీపీ మండల్ 41వ వర్ధంతిని నిర్వహించారు. రెండవ జాతీయ బీసీ కమీషన్ చైర్మన్‌గా నియమితులైన బీపీ మండల్ అంకిత భావంతో దేశమంతా పర్యటించి సమర్పించిన నివేదికలో చేసిన సిఫారసులు ఈ దేశ సామాజిక ప్రగతికి పరిపుష్టతను చేకూర్చాయన్నారు. కార్యక్రమంలో దుంద్ర కుమార స్వామి, చంద్ర పాల్ బాబా పాల్గొన్నారు.

నిర్బంధాలను ఎదుర్కొన్న వ్యక్తే నాయకుడు



మద్దూరి శివాజీని సత్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: ప్రజల కోసం పాటుపడే క్రమంలో ఎదురయ్యే పోలీసు నిర్బంధం, లాఠీ దెబ్బలు, జైలు జీవితాలను ఎదుర్కొన్న వాడే నిజమైన ప్రజా నాయకుడుగా గుర్తింపు పొందుతాడని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం సికింద్రాబాద్ జిల్లా బీజేపీ విస్తృత కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. అంతకు ముందు ఇటీవల టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీని వ్యతిరేకిస్తు ఆందోళన చేపట్టిన బీజేవైఎం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ, ఆయుష్‌రాజ్‌లు 16 రోజుల పాటు జైలు జీవితం అనుభవించి విడుదలైన సందర్భంగా వారిని కిషన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు భరత్‌గౌడ్, గౌతమ్‌రావు, శ్యామ్‌యాదవ్, బండా కార్తిక తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఇఫ్తార్ విందులో,ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే తదితరులు.

ముషీరాబాద్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ అన్నారు. గురువారం ముషీరాబాద్ హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్‌లు ఇఫ్తార్ విందును ప్రారంభించారు. అంతకు ముందు ముస్లిం మతపెద్దలతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహమూద్ ఆలీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల పండుగలను అధికారికంగా నిర్వహిస్తూ పేదలు సుఖసంతోషాలతో పండుగలు జరుపుకునేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తుందన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి జీఎం రామకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: వేసవిలో మంచినీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ కోరారు. గురువారం జలమండలి నారాయణగూడ జనరల్ మేనేజర్ రామకృష్ణను స్థానిక ప్రజలతో ఆమె కలిసి మంచి నీటి సమస్యపై వినతి పత్రం సమర్పించారు. కాచిగూడ డివిజన్‌లోని చెప్పల్‌బజార్, కుద్బిగూడ, ఇందిరానగర్, గణేస్ టెంపుల్ లేన్, మోతిలాల్‌నెహ్రూ నగర్, సూరజ్‌గల్లి, మోతిమార్కెట్, హనుమాన్ టెంపుల్ లేన్, మౌలానా అజాద్ నగర్, తదితర బస్తీలో గత నెల రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు.

బీసీల అభ్యున్నతికి అనేక పథకాలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉమేష్, సాయిచంద్, సత్యం తదితరులు

చిక్కడపల్లి: బీసీల అభ్యున్నతికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక పథకాలు చేపట్టి అమలు చేస్తున్నారని ముషీరాబాద్ నియోజవర్గం బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్ ఎం.ఉమేష్ తెలిపారు. గురువారం గాంధీనగర్ డివిజన్ కాపువాడలో పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీసీలకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను కాపువాడ నివాసులకు అందజేశారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఉమేష్ స్థానికులుక విజ్ఞప్తి చేశారు. బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న సామవేదం రత్నాకర్

కాచిగూడ: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని హైదరాబాద్ ఏంజిల్స్ సీఈఓ సామవేదం రత్నాకర్ అన్నారు. బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ లో గురువారం ఝంకృత్ -2కె23 మేనేజ్‌మెంట్ ఫెస్ట్ రెండు రోజుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఏ, సీఎస్ కోర్సుల ఆవశ్యకతను వివరిస్తూ ఆయా కోర్సుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రతి పేదింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



షాదీ ముబారక్ చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, రెవెన్యూ అధికారులు

అంబర్‌పేట: పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పెద్ద కొడుకుగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు అండగా ఉంటున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం అంబర్‌పేట మండల పరిధిలో షాదీ ముబారక్ పథకం కింద 280 మందికి సుమారు రూ.2.80 కోట్లు మంజూరు అయిన చెక్కులను అంబర్‌పేటలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై తహశీల్దార్ సీహెచ్.లలితాతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలు దేశంలో ఎక్కడ లేవని ఆయన తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై హర్షం



మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి అభినందిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రమేష్‌బాబు

కాచిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన శుక్రవారం నగరం నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తుండటం పట్ల మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మాల మహానాడు ప్రతినిధులు కలిసి అభినందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో 10కే రన్



ర్యాలీలో పాల్గొన్న బీవీ రాఘవులు తదితరులు

కవాడిగూడ: కుల వివక్షను అంతం చేద్దాం సామాజిక న్యాయాన్ని సాదిద్దాం అనే నినాదంతో గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10కె వాక్ ఫర్ సొసైటీ జస్టిస్ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు.సీఐటీయూ మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పాల్గొన్నారు. పాదయాత్ర అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి లిబర్టీ, నారాయణగూడ మీదుగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు సాగింది.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లమల అడవుల్లో యూరేనియం తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించడం బాధాకరమని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్ అన్నారు. గురువారం సుందరయ్య పార్కు వద్ద డాక్టర్ లక్ష్మణ్ వాఖ్యలకు వ్యతిరేకంగా గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈ సందర్భంగా శ్రీరామ్‌నాయక్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం యురేనియం తవ్వకాల పేరుతో నల్లమల్ల అడవులను అదానీకి కట్టబెట్టేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు.

నూతన పైపులైన్ వ్యవస్థ ఏర్పాటుకు కృషి



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: ప్రజల అవసరాలకనుగుణంగా నియోజకవర్గంలో పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో రూ.7.50 లక్షల అంచన వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజి పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇప్పటికే నియోజకవర్గంలో దశాబ్దాల కాలంనాటి పైపులైన్ వ్యవస్థను తొలగించి నూతన పైపులైన్ వ్యవస్థను ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జలమండలి అధికారులతో పాటు స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అధికారులు సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ కాలనీ పేదల నివాసాలను అనుకుని ఉన్న అదనపు స్థలాలను 2016లో క్రమబద్ధీకరించిన విధంగానే 58,59 జీవోల ప్రకారం క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం జవహర్‌నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వరంలో గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం దరఖాస్తులు పేదల నివాసాలను అనుకుని వున్న అదనపు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా సహకరించాలని ఆయన రెవెన్యూ అధికారులకు సూచించారు. పేదప్రజలకు ప్రయోజనం చేకూరాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం 58,59 జీవోలను తీసుకువచ్చిందని తెలిపారు. దానికి అనుకూలంగా క్రమబద్ధీకరించాలని సూచించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి (45) ఉప్పుగూడ - యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.

చీటింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్



అనన్య



రాజ్‌కుమార్



ప్రదీప్‌కుమార్

చిక్కడపల్లి: భూమి డబుల్ రిజిస్ట్రేషన్ కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ తెలిపిన మేరకు.. అశోక్‌నగర్‌లో నివాసం ఉండే వ్యాపారి గత ఏడాది మేడ్చల్‌లో 250 గజాల స్థలం రూ.20 లక్షలకు కొనుగోలు చేశారు. కూకట్‌పల్లికి చెందిన అనన్య ఇన్‌ఫ్రాక్చర్స్ సంస్థ నిర్వాహకులు రూపేస్‌కు మేడ్చల్‌లో ఈ స్థలం అమ్మారు. అయితే అప్పటికే ఆ స్థలం వేరేవారికి విక్రయించడమే కాకుండా రూపేస్‌కు డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం తెలియని రూపేష్ రిజిస్ట్రేషన్ అయిన తర్వాత స్థలం స్వాధీనం చేసుకోవడానికి వెళ్తే అప్పటికే ఆ స్థలం వేరేవారి పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉందని గమనించితాను మోసపోయిన విషయాన్ని వివరిస్తూ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చీటింగ్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేసిన ఎస్ఐ కిరణ్‌కుమార్ ఈ మేరకు అనన్య సంస్థ నిర్వాహకురాలు అనన్య రాజ్‌కుమార్, మేనేజర్ ప్రదీప్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు.

పాడైన బోర్లు పట్టించుకోని అధికారులు



శ్రీరామ్‌నగర్‌లో చేతి పంపు నుంచి కలుషిత నీరు వస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని పలు బస్తీల్లో చేతి పంపులు(బోర్లు) పాడై ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. శ్రీరామ్‌నగర్ బస్తీ, అచ్చయ్యనగర్, సూర్యనగర్, ఈడబ్ల్యుఎస్ క్వాటర్స్ తదితర ప్రాంతాల్లో పూర్తిగా బోర్లు చెడిపోయాయి. అంతేకాకుండా కొన్ని ప్రాంతాల్లోని చేతి పంపుల నుంచి కలుషిత నీరు కూడా వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై అనేకమార్లు వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవకాశాలను ఉపయోగించుకోవాలి



వేడుకలను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్ట్ పి.రాఘవేంద్రరావు

కాచిగూడ: రోజురోజుకు శాస్త్రసాంకేతిక రంగాల్లో విస్తృతమవుతున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని డిఆర్‌డిఓ రిటైర్డ్ సైంటిస్ట్ పి.రాఘవేంద్రరావు పిలుపునిచ్చారు. తెలంగాణ యువతి మండలి ఆధ్వర్యంలో బర్కత్‌పురలో నిర్వహిస్తున్న ఎ.శ్యామల దేవి మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలను గురువారం మండలి హాల్‌లో ఆయన ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. తెలంగాణ యువతి మండలి ఉపాధ్యక్షురాలు ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదిత కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి



వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసీ అధుకారులు కలసి గొయ్యిని పరిశీలిస్తున్న నాయకులు ముఠా జైసింహ

చిక్కడపల్లి: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతినగర్ లింక్ బ్రిడ్జి వద్ద ప్రధాన రోడ్డుకు గొయ్యి పడడంతో గురువారం వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ తదితరులు కలసి ముఠా జైసింహ పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్, గుండు జగదీశ్, క్రాంతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.